క్లుప్తంగా

పీసీబీ డిజైన్‌లో శిక్షణ


శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు పీసీబీ డిజైన్ సాంకేతికలో నైపుణ్యంలో సాధిస్తే మంచి ఉద్యోగాలు సాధించవచ్చని రైజ్ క్రిష్ణ సాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు అన్నారు. టెక్నాలజీ అండ్ కన్సోల్‌టిస్ సర్వీస్ డైరెక్టర్ ఎస్‌వీ నరేష్ ఎలక్ట్రానిక్ పరిశ్రమలో కీలక అంశం అయిన పీసీబీలను తయారు చేసే విధానం అభివృద్ధి చేయడానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించారు. ప్రిన్సిపాల్ కేవీ సుబ్రమణ్యం తెలిపారు. హెచ్‌ఓడీ ఎస్‌వీ రవి కుమార్ , ప్రొఫెసర్ ఎస్. చంద్రశేఖర్, వర్క్ షాప్ కోర్డినేటర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ పూజ చేస్తున్న పూజారులు

నాగులుప్పలపాడు: సృష్టికి మూలం విశ్వకర్మ సూత్రం ప్రపంచానికి దిక్సూచి అని ప్రముఖ అర్చకులు గోనుగుంట వీరబ్రహ్మాచారి తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఉప్పుగుండూరు బ్రహ్మంగారి ఆలయంలో 29వ వార్షికోత్సవం విశ్వకర్మ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేసి ప్రసాద వితరణ చేశారు.

విశ్వకర్మ పూజా మహోత్సవం


విశ్వకర్మ పూజ మహోత్సవంలో భక్తులు

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు రావూరి లక్ష్మయ్య ఆధ్వర్యంలో విశ్వకర్మ పూజా మహోత్సవం నిర్వహించారు.
డాక్టర్ వీర బ్రహ్మాచార్యులు జెండా ఆవిష్కరణ చేశారు. బ్రహ్మయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో స్వామి కి పంచామృత అభిషేకాలు అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. రావూరి లక్ష్మయ్య బ్రహ్మయ్య సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

'ఆచార్యదేవోభవ' అవార్డు ప్రదానం


అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం

ఒంగోలు రూరల్: రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా యువతేజం ట్రస్ట్.. కలాం విజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన 'ఆచార్యదేవోభవ' నేషనల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో దాదావు నాలుగు రాష్ట్రాలు నుంచి ఉపాధ్యాయులను గుర్తించారు. వీరిలో త్రోవగుంట ఏ ఎస్ఆర్జెడ్పీ హెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేయనున్న ఎండీ హాజీరా బేగంకు అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా ఆ స్కూల్ హెచ్ ఎం. బ్రహ్మయ్య.. ఉపాధ్యాయురులు అభినందనలు తెలియ పరిచారు మొదటి ఉపరాష్ట్రపతి.. రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణనాగారి మనవడు, సర్వేపల్ల, సుబ్రహ్మణ్యం శర్మగారి చేతుల మీద ఇచ్చారు.

నులిపురుగుల నిర్మూలన ముఖ్యం


వెంగముక్కలపాలెంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్న క్విస్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు


మద్దిపాడు: గుండ్లాపల్లి పాఠశాలలో..

ఒంగోలు: నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాల్సిన అవసరం ఉందని.. దీనిలో అంతా భాగం కావాలని క్విస్ కళాశాల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సూర్య కల్యాణ చక్రవర్తి అన్నారు. మంగళవారం స్థానిక వెంగముక్కలపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో క్విస్ ఎన్ఎస్ఎస్.. ఫార్మసీ విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడుతూ ప్రతి ఏటా సెప్టెంబర్ 17న జాతీయ నులి పురుగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను ఇస్తారన్నారు. పిఎల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రాలను వేసుకునేలా చూడాలని సూచించారు. ఫార్మసీ విద్యార్థులు నులిపురుగులకు సంబంధించిన 3రకాల వివరాలను వెల్లడించారు. ఈ జాతి పురుగులు పెంపుడు జంతువులైన పిల్లి, కుక్కల్లోనే కాకుండా మట్టిలో కూడా నివసిస్తాయని తెలిపారు. పిల్లలు పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉన్నా లేదా కలుషిత ఆహారం, నీరు తీసుకున్నా నులి పురుగులు చేరతాయన్నారు. పిన్ వారమ్స్ , హుక్స్ వా అనే జీవులు లార్వా రూపంలో మట్టిలో ఉంటాయని, పిల్లలు చెప్పులు లేకుండా మట్టిలో తిరిగినప్పుడు కాళ్ళ చర్మం ద్వారా రక్తంలోకి.. పిల్లల కడుపులోకి నులిపురుగులు చేరితే కడుపునొప్పి, రక్తహీనత, వాంతులు, విరేచనాలు, అలసట, వికారం, బద్ధకం, నిరంతరం దగ్గు, దురద, నొప్పితో కూడిన మూత్ర విసర్జన, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా నులిపురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చని, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా, వ్యక్తిగత మరుగుదొడ్డిని వినియోగించడం, మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో బాగా శుభ్రం చేసుకోవడం, చేతి వేళ్ళ గోర్లు పెరగకుండా ఎప్పటికప్పుడు కత్తిరించుకోవడం చేయాలన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ దివ్య ఔషధం అని రెండేళ్ల వయసు లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను 200 ఎంజీ వేసుకోవాలని, అలాగే మిగతా వయసు పిల్లలకు 400 ఎంజీ ఇవ్వొచ్చు అని తెలిపారు. స్కూల్ అధ్యాపకులు సుజాత, సుందరం పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనమూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మద్దిపాడు: నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకుందామని ఆస్పత్రి డాక్టర్ అనందమోహన్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులు చిన్నారుల పొట్టలో చేరితే వారి ఎదుగుదల తగ్గిపోతుందని, రక్తహీనత ఏర్పడుతుందన్నారు. చిన్నారుల ఆరోగ్యం పెంపొందించేందుకు జాతీయ స్థాయిలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుని నులిపురుగులు రాకుండా చేసుకుందామని, తద్వారా ఆరోగ్యంగా జీవిద్దామని విద్యార్థులకు ఉద్బోధించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, సీహెచ్‌ఓ లలితమ్మ, హెచ్‌వీ సీతమ్మ, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎం రంజాన్‌బీ, ఆశా వర్కర్లు, పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


కరవది జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద ఒంగోలు మండలంలోని కరవది పీఆర్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్లాంట్ ఫర్ మదర్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ అన్సారియా విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుతున్న చెట్టు.. మన కన్నతల్లి లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ చెట్టును నాటి దాని సంరక్షణ బాధ్యతను చేపట్టాలన్నారు. తల్లిని ఎంత ప్రేమగా చూసుకుంటామో మనం నాటిన మొక్కను అంతే ప్రేమగా చూసుకోవాలని పిలుపునిచ్చారు. తామంతా మొక్కలు నాటుతామని, వాటిని జాగ్రత్తగా పెంచుతామని విద్యార్థులు, ఉపాధి పథకం కూలీలు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు 100 కొబ్బరి మొక్కలు నాటారు. స్కూల్‌ప్రాంగణాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అర్జునరావు, జెడ్పీ సీఈఓ కె.మాధురి, డీపీఓ ఉషారాణి, ఆర్‌డీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ కిషోర్, ప్రిన్సిపాల్ పీవీ రవి కుమార్, సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పేరుతో ఓ మొక్క నాటాలి


మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ మేరుగు విద్యా సాగర్, అధికారులు


ఒంగోలు ఉత్తర బైపాస్‌లో మొక్కలు నాటుతున్న ప్రాజెక్టు డైరెక్టర్, ఇతర అధికారులు

- భూ మాతతో పాటు తల్లికి కూడా గౌరవం ఇవ్వాలి
- విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకం, పర్యావరణంపై అవగాహన కల్పించాలి
- ఒంగోలులో 5,500 మొక్కలు నాటాలని లక్ష్యం
- ప్రాజెక్టు డైరెక్టర్ మేరుగు విద్యా సాగర్

ఒంగోలు సబర్బన్: తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని జాతీయ రహదారుల విభాగం నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ప్రాజెక్టు డైరెక్టర్ మేరుగు విద్యా సాగర్ పిలుపునిచ్చారు. స్థానిక ఒంగోలు నగరం ఉత్తర బైపాస్‌లోని ఫ్లై ఓవర్ వద్ద మంగళవారం స్వచ్ఛతా హీ సేవా సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్ పెడ్ మా కే నామ్ (ఒక మొక్క తల్లి పేరుతో) సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రాజెక్టు డైరెక్టర్ మేరుగు విద్యా సాగర్ హాజరై కార్యక్రమం ఉద్దేశాన్ని విపులీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి జాతిపిత మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీ వరకు పక్షోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ రహదారుల విభాగం-సింహపురి ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ సంయుక్తంగా జిల్లా పీఐయూ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2014 ఆగస్టు 15వ తేదీన ప్రారంభించారన్నారు. దేశ వ్యాప్తంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా బహిరంగ మలవిసర్జనకు పరిష్కారం చూపటమే ప్రధాన ధ్యేయంగా కార్యాచరణ చేపట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాల వారికి సబ్సిడీ ఇచ్చి మరీ పాయఖానాలను నిర్మిస్తున్నారని వివరించారు. అందులో భాగంగానే పర్యావరణాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను కచ్చితంగా నాటాలని ఈ ఏడాది ఈ పక్షోత్సవ కార్యక్రమాన్ని రూపొందించారని పేర్కొన్నారు. అందులో భాగంగానే తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్న సంకల్పాన్ని ప్రజల్లో అవగాహన కల్పించేవిధంగా అక్టోబర్ 2వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలను రూపొందించినట్లు వివరించారు. ఈ పక్షోత్సవాల్లో జాతీయ రహదారుల విభాగం ద్వారా దేశ వ్యాప్తంగా 50 వేల మొక్కలు నాటాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, రాష్ట్రంలో జాతీయ రహదారుల్లో 11,800, జిల్లాలోని జాతీయ రహదారుల వెంట 5,500 మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కరోనాలో అందరూ ఎదుర్కొన్న సమస్య ఆక్సిజన్ అని..కానీ ఏమీ ఇవ్వకుండానే చెట్లు మనకు ఆక్సిజన్‌ను అందించి ప్రాణదానం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. టీమ్ లీడర్ రమణ మాట్లాడుతూ మొక్కలు నాటడం ఒక ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా విజయవాడ-బెంగళూరు రహదారి నిర్మాణం ప్రారంభమయిందని, ఆ రహదారి వెంట లక్షల్లో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఒంగోలు పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఎన్‌హెచ్ అధికారులు మొక్కలు నాటారు. సైట్ ఇంజినీర్ నవీన్, టీమ్ లీడర్ సురేష్ బాబు, కె.నరిసింహ రావు, హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికీ గృహం


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న కలెక్టరు తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: అర్హులైన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ) -2.0 పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఒడిషా లోని భువనేశ్వర్‌లో విడుదల చేశారు. ప్రకాశం భవనం నుంచి జిల్లా కలెక్టరు తమీమ్ అన్సారియా, జిల్లా హౌసింగ్ అధికారి పి.శ్రీనివాస ప్రసాద్, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో వీక్షించారు. అనంతరం ఇళ్ళు మంజూరు పత్రాలను, తాళాలను కలెక్టరు తమీమ్ అన్సారియా లబ్ధిదారులకు అందించారు. ఎల్‌డీఎం రమేష్, మెప్మా పీడీ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న నరేంద్రదేవ్

అల్లూరు (కొత్తపట్నం): పరిశరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మండల పరిషత్ కార్యాలయ సూపరింటిండెంట్ నరేంద్రదేవ్ అన్నారు. అల్లూరు గ్రామంలో మంగళవారం స్వచ్ఛత హీ సేవ అనే కార్యక్రమాన్ని నరేంద్రదేవ్ ప్రారంభించారు. వీధులు, రోడ్లు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర మంగళవారం గరిష్టంగా కేజీ రూ.358 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 157వ రోజు వేలం పాటలో 7283 బేళ్లు రాగా 5651 బేళ్లు కొనుగోలయ్యాయి. 1632 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.170, సరాసరి రూ.310.26 పలికింది.

మద్దిపాడు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

మద్దిపాడు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ డి.రమేష్‌బాబు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనికీ చేశారు. డాక్టర్‌లు సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో రోగులకు సేవలు అందించేందుకు పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా అన్న అంశాలను పరిశీలించారు. రోగులకు అవసరమైన సేవలు అందించేందుకు పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో మండలంలో జరిగిన డీవార్మింగ్ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహించారంటూ ప్రశ్నించగా మండలంలో మొత్తం 10728 మంది 1 నుంచి 19 సంవత్సరాల్లోపు చిన్నారులు ఉన్నారని, వారిలో 10,193 మందికి ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చినట్లు వైద్య సిబ్బంది ఆయనకు తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 25వ తేదీన మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా జిల్లాలోని 38 మండలాల పరిధిలో మొత్తం 5,96,751 మంది 19 సంవత్సరాల వయసులోపు ఉన్నారని, అంగన్‌వాడీ సెంటర్లు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు అంగన్‌వాడీ సెంటర్లు డిప్లొమా, డిగ్రీ, నర్సింగ్ కళాశాలలన్నింటిలో వైద్యశాఖ అల్బెండజోల్ మాత్రలు అందించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రులను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆస్పత్రి డాక్టర్‌లు అనందమోహన్, శ్రావణ్‌కుమార్ జిల్లా ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ హేమంత్, జూనియర్ డాక్టర్లు వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ సురేష్

విద్యార్థినులకు నైపుణ్యం అవసరం

మద్దిపాడు: విద్యార్థినులకు చేతి వృత్తుల్లో నైపుణ్యం అవసరమని జిల్లా బాలికాభివృద్ధి అధికారి ఎం.ప్రమోద అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు కుట్లు, అల్లికలపై మంచి నైపుణ్యం వచ్చే వరకూ నేర్పించాలని, చదువులు అయిపోయిన తర్వాత వారు సమాజంలో స్వతహాగా నిలవడానికి చేతి వృత్తులు కారణమవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వస్తున్న ఫ్యాషన్లకు అనుగుణంగా వారికి అవగాహన కల్పిస్తూ అందులో వారు నైపుణ్యం ప్రదర్శించేలా తీర్చిదిద్దాలని చెప్పారు. పాఠశాలకు మంజూరైన ఆప్రాల్, ఆటోమోటివ్ కోర్సులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట వృత్తి విద్య ఉపాధ్యాయిని లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థినులు తయారు చేసిన వస్తువులు పరిశీలిస్తున్న ప్రమోద

పేస్ విద్యార్థులకు బహుమతులు


బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి

ఒంగోలు: స్థానిక పేస్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ, తృతీయ బహుమతులను అందుకున్నారు. జి. అశోక్ కుమార్, బి. రాజు, కోటి, డి. మహేష్ నాయక్ ప్రథమ బహుమతి సాధించగా బి. పావని, ఎన్. సోనియా, ఆర్. మనీషా తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. మంగళవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యత వల్ల ఎంతటి పోటీలోనైనా విజయం సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి మాట్లాడుతూ పోటీ తత్వం పెంచుకోవాలని సూచించారు. కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్.. డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్. వీరాంజనేయులు, ఎంబీఏ విభాగాధిపతి మేరీ జోన్స్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ పోటీలు

ఒంగోలు: ఒంగోలు మండల స్థాయి అండర్ 14, అండర్ 17 బాలబాలికల పోటీలు.. మండల స్థాయి జట్టు ఎంపికలు ఈనెల 19 నుంచి 21వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న బ్యాడ్మింటన్, 20న అథ్లెటిక్స్, చెస్, యోగ, 21న కబాడీ, ఖోఖో , వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాజట్లు ఈనెల 24,25 తేదీల్లో జరిగే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. 2011లోపు జన్మించిన వారు అండర్ 14 విభాగంలో, 2008లోపు జన్మించిన వారు అండర్ 17 విభాగంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. హెచ్‌ఎం సంతకంతో దరఖాస్తు తయారు చేసుకుని హాజరుకావాలని, పూర్తి వివరాలకు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ కె. వెంకటేశ్వరరావుని ఫోన్ 9948837765 లో సంప్రదించాలని కోరారు.

వ్యాయామ విద్య బలోపేతానికి ప్రణాళికలు రూపొందించాలి


పీడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓలు

మద్దిపాడు: వ్యాయామ విద్య బలోపేతానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పీడీలు, పీఈటీల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా బలంగా ఉంటేనే మానసికంగా బలంగా ఉంటారని, అందుకు విద్యార్థులకు వ్యాయామ విద్య తప్పనిసరన్నారు ప్రతి విద్యార్థి ఆటల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సెక్రటరీ వనజ పీడీలు పీఈటీలతో సమావేశమై త్వరలో జరుగనున్న మండల, నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలపై ఇంకా పలు విషయాలపై వ్యాయామ ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా వేణుగోపాలరావు, శ్రీనివాసరెడ్డి, స్వరూపవాణి, కృష్ణ, సమతాకుమార్, రత్నకుమార్‌లు వ్యవహరించినట్లు మండల కోఆర్డినేటర్ బి.సౌజన్య తెలిపారు. సమావేశంలో వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి, మండలాల కో ఆర్డినేటర్లు పీవీ రమణయ్య, బి.శేషగిరి, పలువురు ఫిజికల్ డైరెక్టర్‌లు పీఈటీలు పాల్గొన్నారు.

విజయవాడ చేరిన వైద్యుల పోరాటం

ఒంగోలు టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల పోరాటం గ్రామస్థాయి నుంచి విజయవాడకు చేరింది. ఇన్ సర్వీస్ కోటాను సగానికి సగం తగ్గించింది. పీహెచ్‌సీ వైద్యులు పీజీ సీట్లలో 30 శాతం ఉన్న ఇన్ సర్వీస్ కోటాను 15 శాతానికి తగ్గించడంతో వైద్యుల భవిష్యత్తును దెబ్బతీస్తుందని.. ఆ జీవోను నిరసిస్తూ తొలుత నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై తమ నిరసన తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో విధులను బహిష్కరించి సమ్మెబాట పట్టారు. మంగళవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిరసనకు దిగారు. జిల్లా నుంచి 150 మంది వైద్యులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించడమే కాకుండా టైం బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని వైద్యులు కోరుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ , కార్యదర్శి డాక్టర్ ఖాదర్ మస్తాన్ బి, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ సుదర ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సునీల్ నాయక్, కోశాధికారి డాక్టర్ రమేష్ కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

కొత్తపట్నం: బాల్యం నుంచే హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉంటే ఆనంద జీవితం గడపవచ్చని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్ల వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ గోస్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా? ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని శ్రీదేవి ప్రారంభించారు. వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, ఎటువంటి జాగ్రత్తలు తీసుకవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షణ చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజంలో అందరూ కలిసి జీవించాలి అనే విషయాలు తెలిపారు. గ్రోపాజెక్టు మేనేజర్ షేక్ పీరు బాషా, ఓఆర్‌డబ్ల్యూ ఎస్ఆర్ భవాని, కె.అరుణ, ఉపాధ్యాయులు శేషగిరి రావు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా గొట్టిముక్కల

కొత్తపట్నం: మండలానికి భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడుగా గొట్టిముక్కల శివప్రసాద్‌ను సోమవారం రాత్రి ఏకగ్రీవింగా ఎన్నుకున్నారు. ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ పీసీ యోగయ్య యాదవ్ ఆయనకు నియమాపక పత్రాన్ని అందజేశారు. శివారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మీరు నాకు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, మండల స్థాయిలో భారతీయ జనతా పార్టీ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలు, నిధుల విషయాలను ప్రజలకు తెలియజేస్తూ మరెన్నో కార్యక్రమాలు విస్తృత స్థాయిలో నిర్వహించగలని హామీ ఇచ్చారు. పీవీ శివారెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పలు విభాగాల్లో (ట్రేడ్ల) ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అప్రెంటిస్షిప్ చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఒంగోలు ఏపీఎస్ఆర్టీసీ ప్రజా రవాణాశాఖాధికారి బి. సుధాకర్ రావు తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాను ఆన్‌లైన్‌లో అక్టోబర్ 3వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరధిలో ఆయా ట్రేడ్‌లలో 298 ఖాళీలున్నట్లు చెప్పారు. డీజిల్ మెకానిక్‌లు 201, మోటార్ మెకానిక్‌లు 12, ఎలక్ట్రీషియన్‌లు 50 మంది, వెల్డర్‌లు 7 మంది, పెయింటర్‌లు 4 , మెషనిస్ట్ 1, ఫిట్టర్ 20 మంది, డ్రాఫ్ట్ మెన్ సివిల్ ముగ్గురికి ఖాళీలున్నాయి. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు వారి పూర్తి వివరములను ఆన్‌లైన్ వెబ్ సైట్: [illegible] లో నమోదు చేసుకున్న తర్వాత వెబ్ సైట్‌లో లాగిన్ అయి పోర్టల్ ద్వారా నమోదు చేయాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఒక సెట్ జెరాక్స్‌ను వెరిఫికేషన్ కోసం జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల , ఏపీఎస్ఆర్టీసీ, కాకుటూరు, నెల్లూరులో హాజరు అయ్యే సమయంలో చూపించాలని చెప్పారు. అభ్యర్థులు వంద రూపాయలు రుసుం, రూ. 18 జీఎస్టీ చెల్లించాలని చెప్పారు. తమ జెరాక్స్‌లను అక్టోబర్ 5 తేదీలోపు ప్రిన్సిపాల్, జోనల్ స్టాఫ్ ట్రెనిం కాలేజీ, కాకుటూరు, వెంకటాచలం మండలం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాకు చేరనున్నట్లు పంపాలని చెప్పారు.


పదివేల ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయకుడు


వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలో శివలింగం

వేడుకగా నిమజ్జనం

ఒంగోలు మెట్రో: ఒంగోలు శ్రీనగర్ కాలనీ మొదటి లైన్ లో వేంచేసి ఉన్న శ్రీ విజయ గణపతి ఆలయంలో మంగళవారం నిమజ్జనానికి బయలుదేరారు. మహా కుంబాభి కుంభాభిషేకం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే మంగమూరు రోడ్డు గాంధీ నగర్ నాలుగో లైన్ లో పదివేల రూపాయలతో గణనాథునికి ప్రత్యేక అలంకరణ చేశారు.


దప్పు వాయిద్యాల మధ్య విజయ గణపతి నగరోత్సవం